



క్లాస్ పీకాక కదలిక..!

◆ అధినాయకుడి మందలింపు ◆ ప్రాజెక్టుల వద్దకు టిడిపి నేతల పరుగులు
◆ చివరి వరకు ఇదే తీరు కొనసాగేనా..?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ప్రాజెక్టుల పరిశీలన సమయంలో జిల్లా ముఖ్య నేతలకు క్లాస్ పీకినట్టు సమాచారం. తమ హయాంలో చేపట్టిన పనులు కళ్లకు కనబడుతున్నా.. వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడంలో విఫలమవుతున్నారని అంక్షితలు పెట్టారు. ప్రాజెక్టుల యాత్ర ముగిసిన తరువాత చిత్తూరు జిల్లాలోకి ప్రవేశించే సమయంలో జిల్లా ముఖ్య నేతలందరితోనూ సమావశం అయ్యారు. ఈ సమయంలో అందరికీ క్లాస్ పీకినట్టు సమాచారం. ప్రభుత్వ వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తున్నా క్షేత్ర స్థాయిలోకి తీసుకెళ్లే ప్రయత్నం చేయడం లేదని సుతిమెత్తగానే మందలించారు. దీంతో నేతలు ఒక్కసారిగా మేలుకుని ప్రాజెక్టుల చుట్టూ పరుగులు పడుతున్నారు. ఆదివారం రోజు ఉన్న ఫలంగా ముదిగుబ్బకు చేరుకుని జిల్లేడుబండ ప్రాజెక్టు సమస్యపై స్పందించారు. నిర్వాసితులకు పరిహారమివ్వకుండానే ప్రాజెక్టులు చేపట్టారని ఆందోళన బాటపట్టారు. వాస్తవానికి ఇదే నియోజకవర్గంలోని తాడిమర్రి మండలం పరిధిలో చిత్రావతి ముంపు నిర్వాసితుల పరిహారం విషయంలో అప్పట్లో పెద్దఎత్తున మరిమేకలపల్లి గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఇప్పటికీ ఇంకా అనేక మందికి పరహారం అందాల్సి ఉంది కాని ప్రభుత్వం ఇప్పటికీ ఇవ్వలేదు. ఈ ఆందోళనకు అప్పట్లో సిపిఎం మద్దతు ప్రకటించింది. కాని తెలుగుదేశం పార్టీ ప్రేక్షకపాత్రనే పోషించింది. ఇప్పటికీ ఆ సమస్యను పట్టించుకున్న దాఖలాల్లేవు. అయితే ఇప్పుడు అధినాయకుడి మందలింపుతో జిల్లేడుబండ ప్రాజెక్టుపై స్పందించారు. సోమవారం నాడు మడకశిర ప్రాజెక్టు పరిశీలించేందుకు వెళ్లారు. ఇలా వరుసగా కార్యక్రమాలు పెట్టుకోవడం నాలుగేళ్లలో ఇదే ప్రథమం కావడం గమనార్హం.

ఇదే పోరాటం కొనసాగేనా..!

వైసిపి నాలుగేళ్ల పాలనలో జిల్లాలోని ప్రధానమైన ప్రాజెక్టులు ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. హంద్రీనీవా ప్రవాహ సామర్థ్యం ఆరు వేల క్యూసెక్కులకు పెంచుతామని ప్రకటించి చేపట్టలేదు. కేవలం టెండర్లకే పరిమితమైంది. బిటిపి ఎత్తిపోతలకు ఇటీవలనే పరిహారం వరకు వచ్చింది. పనులు ముందుక సాగలేదు. ఇక పేరూరు ఎత్తిపోతలకు పరిహారం కూడా ఇవ్వలేదు. రూ.50 కోట్ల నిధులు అవసరం అవుతాయి. అవి విడుదల అవలేదు.. పనులూ ముందుకు సాగలేదు. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ నిర్వహణ అధ్వాన్నంగా మారింది. మూడేళ్లు తుంగభద్ర డ్యామ్‌లో పుష్కలంగా నీరున్నా పూర్తి స్థాయిలో నీరు తీసుకోలేని పరిస్థితి నెలకొంది. ఆధునీకరణ పనులను రద్దు చేశారు. ఇవే కాకుండా గుంతకల్లు బ్రాంచ్ కెనాల్, మిడ్‌పెన్నార్ దక్షిణ కాలువ ఆధునీకరణ పనులు టిడిపి హయాంలో చేపట్టినవికూడా రద్దు చేసే పరిస్థితి నెలకొంది. వీటిపై ఆ పార్టీ నాయకులు ఇప్పటి వరకు స్పందించిన దాఖలాల్లేవు. ఇప్పుడు అధినాయకుడి పర్యటన, మందలింపు తరువాతనైనా ఆ పార్టీ నేతలు ఈ ప్రధానమైన సమస్యలపై స్పందిస్తారా లేదా అన్నది చూడాల్సి ఉంది.

మున్సిపల్ కార్మికుల కన్నెర్ర

◆ సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి
◆ తీవ్ర ఉద్రిక్తతల నడుమ నాయకుల అరెస్ట్
◆ కార్మికులను ఈడ్చివేసిన పోలీసులు
◆ పలువురికి గాయాలు, స్పృహతప్పి పడిపోయిన నాయకులు
◆ సమస్యలు పరిష్కరించమంటే అరెస్టులా..?
◆ సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ఎన్నికల హామీలు, దీర్ఘకాలింగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంపై మున్సిపల్ కార్మికులు కన్నెర్ర చేశారు. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కార్మికులు పోరుబాట పట్టారు. ప్రభుత్వం తీరును నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో కార్మికులు కలెక్టరేట్‌ను దిగ్బంధించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న కార్మికులపై పోలీసులు జులుం ప్రదర్శించారు. కనీసం సమస్యను అధికారులకు విన్నవించేందుకు కూడా అవకాశం ఇవ్వండా అడ్డుకున్నారు. కలెక్టరేట్ గేటు ముందునుంచి కార్మికులు, సిఐటియు నాయకులను ఈడ్చిపారేశారు. ఈ క్రమంలో పలువురి శరీరంపై గాయాలు అయ్యాయి. గాయపడిన వారిలో మహిళా కార్మికులు కూడా ఉన్నారు. పోలీసుల తీరుపై సిఐటియు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ కార్మికులు, సిఐటియు నాయకులు సోమవారం నాడు కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా నగరంలోని సంగమేష్ సర్కిల్ నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అప్పటికే పెద్ద ఎత్తున పోలీసులు మోహరించడంతో నాయకులు రోడ్డుమీద బైఠాయించి రాష్ట్ర ప్రభుత్వ విధానాలు వ్యతిరేకిస్తూ ఆందోళన నిర్వహించారు. మున్సిపల్ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు ఏటీఎం. నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ముఖ్యఅతిథిగా హాజరై మద్దతు ఇచ్చారు. ఆయనతోపాటు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.నాగభూషణం, సిపిఎం నగర కార్యదర్శులు వి.రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు హాజరయ్యారు.

కార్మికుల సమస్యలు కన్పించవా..?
సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

నిజాయితీగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వానికి పట్టవా అని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ప్రశ్నించారు. కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ కరోనా విపత్కర కాలంలో సైతం మున్సిపల్ కార్మికులు ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించారని చెప్పారు. ఆ సమయంలో మున్సిపల్ కార్మికులను దేవుళ్లు, కరుణామయులు అంటూ కీర్తించిన ప్రభుత్వ పెద్దలు ప్రస్తుతం వారి సమస్యలు పరిష్కరించమంటే ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. నవరత్నాలు 98 శాతం పూర్తి చేసామని గొప్పలు చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను ఎందుకు పరిష్కరించడం లేదన్నారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను రెగ్యులరైజ్ చేస్తామని ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. ఆ హామీని తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు, ఇతర సమస్యలు పరిష్కరించేంత వరకు మున్సిపల్ కార్మికుల చేపట్టే ప్రతి పోరాటానికి సిపిఎం సంపూర్ణ మద్దతి ఇచ్చి ప్రత్యక్ష పోరాటంలో పాల్గొంటుందని చెప్పారు.



వి.రాంభూపాల్‌ను బలవంతంగా అరెస్టు చేస్తున్న పోలీసులు



సొమ్మసిల్లి పడిపోయిన సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్



సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్‌ను బలవంతంగా అరెస్టు చేస్తున్న పోలీసులు

ఎంతటి పోరాటానికైనా సిద్ధం
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధం అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్ తెలిపారు. మున్సిపాల్టీల్లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్, పారిశుధ్యం కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. మున్సిపల్ కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం కోరుతూ పలు దుపాలుగా ఆందోళన చేసినా రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందనలేదన్నారు. మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేసి, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. సిపిఎస్ రద్దు చేసి ఓల్డ్ పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు ఇంజినీరింగ్ విభాగం కార్మికులకు స్కిల్డ్ సెమీ స్కిల్డ్, అనంతపురం నగరంలో కోవిడ్ సమయంలో తీసుకున్న కార్మికులను, 30 సంవత్సరాలుగా పని చేస్తున్న గార్బేజ్ కార్మికులను అవుట్‌సోర్సింగ్ కార్మికులుగా గుర్తించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సమస్యలపై స్పందించకుంటే నెల 17వ తేదీన చలో విజయవాడకు వెళ్లి అక్కడ అసెంబ్లీని దిగ్బంధం చేస్తామని హెచ్చరించార. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి, నగర అధ్యక్ష కార్యదర్శులు బాబు, వెంకటనారాయణ, గురురాజు, నాయకులు శ్రీనివాసులు, భగత్ సింగ్ ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్టీఆర్ శ్రీనివాసులు, మున్సిపల్ యూనియన్ కోశాధికారి బత్తల ఆదినారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు నరసయ్య, అనంతపురం నగర అధ్యక్ష, కార్యదర్శులు బండారు ఎర్రిస్వామి తిరుమలేష్, లక్ష్మీ నరసమ్మ, ఆంజనేయులు, జగదీష్, వన్నూరప్ప, నరసింహమూర్తి, రామాంజనేయులు, సూర్యనారాయణ, మల్లేష్, రాము, ఎమ్మార్పీఎస్ యూనియన్ నాయకులు వల్లప్ప, వెంకటేష్‌తో జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాల్టీల కార్మికులు పాల్గొన్నారు.

పోలీసుల జులుం... కార్మికులను ఈడ్చివేత..

ఆందోళనలో భాగంగా సిఐటియు నాయకులు, కార్మికులు కలెక్టరేట్ లోపలికి వెళ్లడానికి ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు కార్మికులను ప్రధానగేటు వద్దనే అడ్డుకుని లాగిపడేశారు. తోపులాటల మధ్య నాయకులు, కార్మికులకు గాయాలయ్యాయి. ఓ కార్మికునికి కంటికి తగిలి తీవ్ర రక్తస్రావం జరిగింది. మరో నాయకుడికి కాలికి గాయమైంది. మహిళా కార్మికులకు చేతి గాజులు గుచ్చుకుని గాయపడ్డారు. కొందరు మహిళలు అస్వస్థతకు గురై స్పృహ కోల్పోయారు. మున్సిపల్ కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణ కలెక్టరేట్ గేట్ ఎక్కి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించాడు. పోలీసులు అడ్డుకుని ఆయన్న కిందకులాగారు. దీంతో కార్మికులు ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ మూకుమ్మడిగా కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేశారు. 'మా కడుపు మంట మీకు పట్టదా.?.. కార్మికుల అంటే మీకు అంత తెలుసా'..! అంటూ పోలీసులపై ప్రతిఘటించారు. పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్న పోలీసులు బలవంతంగా కార్మికులు, సిఐటియు నాయకులను రోడ్డుపై ఈడ్చుకుంటూ పోలీస్ వాహనంలోకి విసిరేశారు. పోలీసు వాహనంలో అరెస్టు చేసి తీసుకెళ్తుండగా కార్మికులు వారి వాహనాలకు అడ్డుపడి నిరసన తెలిపారు. వాహనం ముందు పడుకుని తమ నాయకుల్ని వదిలేయాలని ప్రతిఘటించారు. దాదాపు గంటపాటు కలెక్టరేట్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సమయంలో పోలీసులు మరింత కఠినంగా వ్యవహరించి మహిళా కార్మికులను కాళ్లతో తన్ని రోడ్డుపై మరోసారి ఈడ్చిపారేశారు. వాహనానికి అడ్డుగా వచ్చిన కార్మికులను తోసేసి ముఖ్య నాయకులను పోలీస్ స్టేషన్ తరలించారు.

అరెస్టులు... స్పృహతప్పి పడిపోయిన నాయకులు

ఆందోళనలో భాగంగా పోలీసులు పలువురిని బలవంతంగా అరెస్టు చేసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణితో పాటు పలువురు కార్మికులు స్పృహతప్పి కిందపడ్డారు. అయినా పోలీసులు ఆగగండా అరెస్టుల పర్వం కొనసాగించారు. రాంభూపాల్‌తో పాటు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, సిపిఎం నగర కార్యదర్శులు వి.రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు, సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి, మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.నాగభూషణ, జిల్లా అధ్యక్షుడు ఎటిఎం.నాగరాజు, సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు బాబు, వెంకటనారాయణ, గురురాజు, శ్రీనివాసులు తదితరులను అరెస్టు చేసి నగరంలోని వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు.







పోలీసుల ఈడ్చివేతతో కార్మికుల శరీరంపై పడిన గాయాలు



పోలీసులు లాగివేసే క్రమంలో చిరిగిపోయిన చొక్కాను చూపుతున్న మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎటిఎం.నాగరాజు

చేనేత రంగాన్ని ప్రోత్సహిద్దాం

కలెక్టర్ ఎం. గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



చేనత వస్త్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమి

చేనేత వస్త్రాలను ప్రతి ఒక్కరూ కొనుగోలు చేసి, ఆ రంగాన్ని ప్రోత్సహిద్దామని కలెక్టర్ ఎం.గౌతమి పేర్కొన్నారు. సోమవారం నాడు అనంతపురం నగరంలోని పోలీస్ కాంప్లెక్స్‌లో ఉన్న ఆప్కో శిల్క్ హౌస్ వద్ద 9వ జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆప్కో చేనేత వస్త్ర ప్రదర్శన మరియు అమ్మకాలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ చేతితోనేసిన పట్టు వస్త్రాలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎంతో డిమాండ్ ఉందన్నారు. అనంతపురం జిల్లాలోని ఉరవకొండ, జిల్లా పక్కన ఉన్న ధర్మవరంలో నూతన సాంకేతికతను ఉపయోగించి కంప్యూటరైజ్డ్ డిజైన్స్ పెట్టుకుని నూతన డిజైన్లు, నాణ్యతతో సిల్క్ తయారు చేయడం కార్మికుల ప్రతిభకు అద్దం పడుతోందన్నారు. చేనేతలను ప్రోత్సహించాల్సిన అవసరం ప్రభుత్వంపై, మనందరిపై ఉందన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేతలను సత్కరించడం, వారి కళను గుర్తించి వారికి గుర్తింపును ఇవ్వడం జరుగుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కూడా చేనేతలను అన్ని విధాలా ఆదుకునే చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ప్రతి శనివారం జిల్లా అధికారులు చేనేత వస్త్రాలు ధరించి రావాలని ఆదేశాల జారీ చేశామన్నారు. ఈ సందర్భంగా 9 మంది చేనేత కార్మికులను కలెక్టర్ సన్మానించారు. అంతకుముందు నగరంలోని టవర్ క్లాక్ నుంచి సప్తగిరి సర్కిల్ మీదుగా పోలీస్ కాంప్లెక్స్ వద్దనున్న సిల్క్‌హౌస్ వరకు చేనేత నడకను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత మరియు జౌళి శాఖ అధికారి శ్రీరంగం అప్పాజీ, పిఆర్ ఎస్ఈ భాగ్యరాజ్, జెడ్పీ సిఈవో భాస్కర్ రెడ్డి, ఉద్యాన శాఖ డిడి రఘునాథరెడ్డి, ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్ ఖాన్, జిల్లా టూరిజం అధికారి నాగేశ్వర్ రెడ్డి, తహశీల్దార్ శ్రీధర్ మూర్తి, తొగటవీర క్షత్రియ డైరెక్టర్ ప్రభావతి, మాజీ ఆప్కో డైరెక్టర్ శ్రీనివాసులు, డిఓ బసవరాజు, ఏడీవోలు నరసింహరెడ్డి, మురళీమోహన్, శ్రీనివాసులు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గ్రామ రెవెన్యూ సహాయకులు (విఆర్‌ఎ)ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (సిఐటియు అనుబంధం) జిల్లా అధ్యక్షులు ప్రసాద్ అధ్యక్షతన కలెక్టరేట్ ఎదుట రెండు రోజుల నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేశారు. తక్కువ వేతనాలతో పని చేస్తున్న విఆర్‌ఎలకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. విఆర్‌ఏలకు విఆర్‌ఓలుగా పదోన్నతులు కల్పించాలన్నారు. విఆర్‌ఏలకు టిఏ, డిఏలు నిలపుదల చేసి ఒక్కొక్క విఆర్‌ఏతో రూ.19 వేలు రికవరీ చేయడం అన్యాయంగా ఉందన్నారు. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈనెల 25న 'జగనన్నకే చెబుదా' అని చలో విజయవాడ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వై.వెంకటనారాయణ, విఆర్‌ఎల సంఘం నాయకులు చిరంజీవి, పరమేశ్వరప్ప, బాలకృష్ణ, సుబ్రమణ్యం, వై.సుంకన్న, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయానికి ముళ్లకంప

తరలించవద్దని రాచేపల్లివాసుల నిరసన

ప్రజాశక్తి-శింగనమల

మండలంలోని రాచేపల్లిలో సచివాలయాన్ని తరలించరాదని స్థానికులు సోమవారం సచివాలయానికి తాళం వేసి నిరసన తెలిపారు. నాలుగు గ్రామాలకు పంచాయతీ కేంద్రమైన రాచేపల్లిలో సచివాలయం ఉండాలని డిమాండ్ చేశారు. అలాంటి సచివాలయాన్ని పంచాయతీలో ఓ గ్రామమైన నిదనవాడకు మార్చాలని చూడటం బాధాకరమన్నారు. సచివాలయం తరలింపు ఆపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



సచివాలయానికి కంప కొట్టిన దృశ్యం

బీడీ కార్మికులకు ఇళ్ల పట్టాలు కేటాయించాలి

ఎపి బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులు

ప్రజాశక్తి-తాడిపత్రి



బీడీ కార్మికులకు గతంలో కేటాయించిన స్థలాలన పరిశీలిస్తున్న ఎపి బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులు

పట్టణంలోని బీడీ కార్మికులకు ఇళ్లపట్టాలు వెంటనే కేటాయించాలని ఎపి బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులు డిమాండ్ చేశారు. సోమవారం గతంలో పట్టణ శివారులో బీడీ కార్మికులకు కేటాయించిన స్థలాలు పరిశీలించారు. అనంతరం పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఎపి బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో వేలాదిమంది బీడీ కార్మికులు తీవ్ర దుర్భర పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నారన్నారు. అలాంటి కార్మికులకు ఇంతవరకూ ఇళ్ల స్థలాలు కేటాయించకపోవడం దారుణమన్నారు. గతంలో స్టీల్‌ప్లాంట్ దగ్గర, ఆటోనగర్ దగ్గర ఇచ్చిన స్థలాల్లో పలు సమస్యలు ఉన్నాయన్నారు. బీడీ కార్మికులకు స్థలాలు ఇవ్వాలని దాదాపు 300 అర్జీలు ఇచ్చినప్పటికీ ఎలాంటి సర్వే చేయకపోవడం బాధాకరమన్నారు. తక్షణం బీడీ కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం బీడీ కార్మికులతో కలిసి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. తర్వాత తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఏపీ బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా షర్మిల, కార్యదర్శిగా ఉమాగౌడ్, కోశాధికారిగా కౌసర్, కమిటీ సభ్యులు పర్వీన్, గౌసియా, నూరి, మాబుజాన్, ఎస్.గౌసియాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే పాతకోట కో ఆప్షన్ సభ్యులుగా ఇద్దరిని, గాంధీనగర్ కోఆప్షన్ సభ్యులుగా ముగ్గురు, కాలుగడ్డివీధి కో ఆప్షన్ సభ్యులుగా ముగ్గురు, ఆసుపత్రి పాలెం కోఆప్షన్ సభ్యులుగా ఇద్దరు, గోపాల్ రెడ్డి కాలనీ కోఆప్షన్ సభ్యులుగా ఇద్దరు, యాడికి కో ఆప్షన్ సభ్యులుగా ఇద్దరూ , ఎల్లనూరు మండలం కో ఆప్షన్ సభ్యులుగా ఇద్దరిని ఎంపిక చేయాలని నిర్ణయించారు.

ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విస్తృత పర్యటన

ప్రజాశక్తి-నార్పల, బుక్కరాయసముద్రం, శింగనమల



పాఠశాలలో భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న ఎపి ఫుడ్ కమిషన్ ఛైర్మన్

ఏపీ ఫుడ్ కమిషన్ ఛైర్మన్ సిహెచ్ విజయ ప్రతాపరెడ్డి సోమవారం జిల్లాలోని బుక్కరాయసముద్రం, నార్పల, శింగనమల మండలాల్లో పర్యటించారు. ముందుగా అనంతపురం నగరంలోని ఆదిమూర్తి నగర్ సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్‌ను తనిఖీ చేశారు. భోజనాలు ఎలా ఉన్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తనిఖీ చేసి విద్యార్థులతో ముచ్చటించారు. అక్కడే ఉన్న ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాయ్స్ స్కూల్ లో టిఫిన్ తనిఖీ చేసి రుచి చూశారు. బుక్కరాయసముద్రం గాంధీనగర్‌లో అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసి చిన్నపిల్లలకు, గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు పౌష్టికాహారం ఇస్తున్నారా అంటూ లబ్ధిదారులకు ఫోన్ చేసి విచారించారు. కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో తనిఖీ చేసి మధ్యాహ్నం భోజనం పథకం అమలుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తదనంతరం బుక్కరాయ సముద్రం మండలంలోని రేకులకుంటలో అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. రేకులకుంట, దయ్యాలకుంటపల్లి, వెంకటాపురంలో రేషన్ షాపులను తనిఖీ చేశారు. నార్పల మండల కేంద్రంలో కస్తూరిబా బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేసి జగనన్న గోరుముద్ద పథకం అమలుపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి కేంద్రం తనిఖీ చేసి పౌష్టికాహారం పంపిణీపై లబ్ధిదారులతో మాట్లాడారు. అక్కడే ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద అమలుపై తనిఖీ చేసి మెనూ అమలుపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. శింగనమలలోని కెజిబివి పాఠశాల, స్టాక్‌పాయింట్ గోడన్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, డిఎస్ఓ శోభారాణి, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, డిటిడబ్ల్యువో అన్నాదొర, డీఈవో సాయిరాం, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల దీక్షలు


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆర్‌డబ్ల్యుఎస్ శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకంలో పని చేస్తున్న కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే దీక్షలు సోమవారం 7వ రోజుకు చేరుకున్నాయి. వీరి దీక్షలకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి పథకం కార్మికుల బకాయి వేతనాలు, బకాయి పడ్డ ఇఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యుటీ చెల్లించాలన్నారు. కలెక్టర్ ఇచ్చిన హామీ కూడా అమలు కాకపోవడం శోచనీయంగా ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈనెల 19వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా పథకం కార్మికుల యూనియన్ అధ్యక్షులు తిప్పేస్వామి, నాగరాజు, శ్రీనివాసులు, మధు, రవి, చారి, లక్ష్మిరెడ్డి, తిరుపాల్‌నాయక్, శ్రీనివాసనాయక్, తదితరులు పాల్గొన్నారు.

80 శాతం సబ్సిడీపై 'ప్రత్యామ్నాయ' విత్తనాలు

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి యు.ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో వర్షాభావం నెలకొన్న నేపథ్యంలో 26 మండలాల్లో 80 శాతం రాయితీతో ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో సాగు కావాల్సిన ప్రధాన పంట వేరుశనగ వర్షాభావ పరిస్థితులు కారణంగా 26 మండలాల్లో సాగు విస్తీర్ణం తగ్గిందన్నారు. దీంతో ప్రత్యామ్నాయ పంటల సాగుకు రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రత్యామ్నాయ పంటల విత్తనాలైన 1218 క్వింటాళ్ల పెసలు, 11,684 క్వింటాళ్ల ఉలవలు, 836 క్వింటాళ్ల అలసందలు, 516 క్వింటాళ్ల కొర్రలను జిల్లాకు కేటాయించనున్నట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో ఆగస్టు 8వ తేదీ వరకు పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు.

టిడిపితోనే 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-గార్లదిన్నె


భవిష్యత్తుకు గ్యారెంటీపై ప్రచారం చేస్తున్న బండారు శ్రావణిశ్రీ

తెలుగుదేశం పార్టీతోనే ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ అని నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రావణిశ్రీ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కమలాపురం పంచాయతీలో భవిష్యత్తు గ్యారెంటీ పేరుతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం సాధిస్తే ప్రతి కుటుంబానికి సంవత్సరానికి రూ.1,22,000 ఆదాయం చూపనున్నట్లు తెలిపారు. దీంతోపాటు ఉద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆడబిడ్డలు ఇంటింటికే మంచినీరు, బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొచ్చి అన్నివిధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమలాపురం సర్పంచి శ్రీరాములు, గుడ్డపల్లి ఓబిరెడ్డి, గుత్తా హరి, చల్లా నాగరాజు, రమణప్ప, మాజీ ఎంపిటిసి నాగభూషణం, పుల్లన్న, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-ఉరవకొండ

తల్లిపాలతో బిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఉరవకొండ లయన్స్ క్లబ్ అధ్యక్షులు జయకృష్ణ తెలిపారు. సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా బాలింతలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ ఎస్.సురేంద్ర, ట్రెజరర్ ఈ.శ్రీరాములు, జిల్లా చైర్మన్ టి.గణేష్‌బాబు, మాజీ అధ్యక్షులు సప్తగిరి మల్లికార్జున, సభ్యులు బి.జయన్న, ఎస్.నాగేశ్వరరావు, పీగంగాధర్, బి.లక్ష్మీనారాయణ, బి.నగేష్‌బాబు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : మండల పరిధిలోని సోమదనపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ టి.ఉమాదేవి ఆధ్వర్యంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అన్నారు. బిడ్డకు డబ్బా పాలు తాగించడం వల్ల అనారోగ్యానికి గురవుతారన్నారు. కావున తప్పకుండా తల్లిపాలే పట్టించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు టి.రత్నమ్మ, బి.సరస్వతి, ఆయా రామాంజనమ్మ, గర్భిణులు, బాలింతలు, పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ


పోస్టర్లను విడుదల చేస్తున్న వైద్యసిబ్బంది

గర్భిణులతోపాటు చిన్నపిల్లల ఆరోగ్యమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని విడపనకల్ ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి తెలిపారు. సోమవారం విడపనకల్ మండలం గడేకల్ గ్రామంలో ఉన్న ఆరోగ్య ఉపకేంద్రంలో మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ ఇంద్రధనస్సులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 0-5సంవత్సరాల్లోపు చిన్నారులతోపాటు గర్భిణులను గుర్తించి వారందరికి టీకాలు వేయాలన్నారు. ప్రతి కుటుంబంలో తల్లిదండ్రులు బాధ్యత తీసుకుని చిన్న పిల్లలు, గర్భిణులకు సమీపంలోని ఆరోగ్య ఉప కేంద్రాల వద్దకు కాని, మీ గ్రామాలకు కేటాయించిన వైద్య సిబ్బందినిగాని సంప్రదించి టీకాలు వేయించుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి సమస్యలతో ఇబ్బందులు పడకుండా గుర్తించిన సిఎం జగన్ ఇంటింటికి వెళ్లి గుర్తించి ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సరఫరా చేస్తున్న అందిస్తున్న టీకాలను కచ్చితంగా వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది సుగుణ, ఫర్హాన్, శివరామకృష్ణ, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, తదితరులు పాల్గొన్నారు.

చేనేతల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

మాజీ ఎంపీ బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే విశ్వ

ప్రజాశక్తి-ఉరవకొండ


మాట్లాడుతున్న మాజీ ఎంపీ బుట్టా రేణుక

చేనేతల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని కర్నూలు మాజీ ఎంపీ బుట్టా రేణుక, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని తొగటవీర క్షత్రియ కళ్యాణ మండపంలో జాతీయ చేనేత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక నేతన్న నేస్తం పథకం కింద ఒక్కో లబ్దిదారునికి రూ.24 వేలు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే చేనేత ఉత్పత్తులను అమ్ముకోడానికి ఆన్‌లైన్ సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. ఆప్కో అభివృద్ధికి రూ.468 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. అంతేగాకుండా బీసీ కులాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే విశ్వ మాట్లాడుతూ నియోజకవర్గంలో అండర్‌గ్రౌండ్ సొసైటీల కోసం రూ.1.50 కోట్లతో క్లస్టర్ ఏర్పాటు చేశామన్నారు. దీనివల్ల 350 మంది నేత కార్మికులు లబ్ది పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత సంఘం నాయకులు ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, చేనేతలు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి-డి.హీరేహాళ్

స్థానిక అంబేద్కర్ కాలనీ సమీపంలో నుంచి అంతర్ రాష్ట్ర రహదారి వరకూ రాయదుర్గం వెళ్లే ప్రధాన రహదారిలో రూ. 40 లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణానికి సోమవారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైసిపి మండల కన్వీనర్ వన్నూరుస్వామి మాట్లాడుతూ హీరేహాళ్ నుంచి రాయదుర్గం వెళ్లే మార్గం ప్రధాన రహదారి అయినప్పటికీ ఆర్‌అండ్‌బి పరిధి వరకూ తారు రోడ్డు వేసి పంచాయతీ పరిధిలోని 660 మీటర్ల మేర రోడ్డు వేయలేదన్నారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణికులు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి సిసి రోడ్డు ఏర్పాటుకు ఉపాధి ఎస్ నిధుల కింద రూ. 40 లక్షలు మంజూరు చేయించారన్నారు. కార్యక్రమంలో పిఆర్ జెఈ లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ భాస్కర్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ భోజరాజు నాయక్, సర్పంచులు లక్ష్మీదేవి, మల్లినాథ, ఎర్రిస్వామిరెడ్డి, కాంట్రాక్టర్ వెంకటేశులు, నాయకులు జగదీష్, రహంతుల్లా, నాగ, కాంతారావు, ఎర్రిస్వామి, గొల్ల సురేష్, మంజు, కాశీంపీరా, తదితరులు పాల్గొన్నారు.

తోళ్ల పరిశ్రమను ప్రారంభించాలి

సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్


సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్

ప్రజాశక్తి-శింగనమల

మండలంలోని రాచేపల్లి వద్ద ఉన్న తోళ్ల పరిశ్రమను వెంటనే ప్రారంభించి శిక్షణ పొందిన వారికి ఉపాధి కల్పించాలని సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో సిపిఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పనులు పెట్టాలన్నారు. అలాగే పెండింగ్‌లోఉన్న బిల్లులను వెంటనే కూలీల ఖాతాల్లోకి జమచేయాలన్నారు. భూమిలేని కుటుంబాలకు మూడెకరాల భూమి కొని ఇవ్వాలని, రాచేపల్లి వద్ద ఉన్న చెప్పుల తోళ్ల పరిశ్రమను ప్రారంభించి శిక్షణ తీసుకున్న వారికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే పంచాయతీ కేంద్రమైన రాచేపల్లిలోనే సచివాలయాన్ని ఉంచాలన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపిసి, బైపిసి గ్రూపులతోపాటు ఇంగ్లీష్ మీడియం ఏర్పాటు చేయాలన్నారు. ఇకపోతే సలకంచెరువు, నిదనవాడ, ఉల్లికల్లు గ్రామాల్లో శ్మశానాలకు స్థలాలు చూపాలని డిమాండ్ చేశారు. ముంపునకు గురైన ఉల్లికల్లు గ్రామస్తులకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో సుంకన్న, ఆంజనేయులు, కొండారెడ్డి, ఆంజనేయులు, జయరాముడు, శ్రీనివాసులు, సూర్యప్రకాష్, రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

"కాపు" ఇసుకాసురుడు

సెల్ఫీ ఛాలెంజ్‌లో కాలవ


వేదవతి నది వద్ద సెల్ఫీ దిగుతుతున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

దశాబ్దాల కాలంగా నీటి జాడలెరుగని వేదవతి, హగరికి జలకళ తెప్పించేందుకు తాను కృషి చేస్తే, అదే నది నుంచి ఇసుకను తోడేస్తూ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి రూ. కోట్లు దండుకుంటున్నాడని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు ఆరోపించారు. సెల్ఫీ ఛాలెంజ్‌లో భాగంగా టిడిపి హయాంలో మండల పరిధిలోని మల్కాపురం సమీపంలో వేదవతి(హగరి)లో నిర్మించిన సబ్ సర్ఫేస్ డ్యాం వద్ద సోమవారం కాలవ 17వ సెల్ఫీ వీడియోను విడుదల చేశారు. వర్షాభావ పరిస్థితులకు తోడు కర్నాటకలో నదికి అడ్డంగా చెక్ డ్యాంలు నిర్మించడం వల్ల హగరిలో నీటి జాడలు కరువయ్యాయన్నారు. అలాంటి నదికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు టిడిపి పాలనలో సబ్ సర్ఫేస్ డ్యాంలు నిర్మించాలనే బృహత్ ప్రయత్నం చేశామన్నారు. మల్కాపురం సమీపంలో నది గర్భంలో అలాంటి కట్టడాన్ని నిర్మించామన్నారు. ఈ డ్యాం వల్ల నదిలో నీరు పారినప్పుడు, భాగర్భంలో నీళ్లు ఇంకి రైతు బోర్లు రీఛార్జీ అవుతాయన్నారు. వేదవతికి తిరిగి జీవం పోసే ఈ మహత్తర కార్యాన్ని వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన రాజేంద్రసింగ్ చేతుల మీదుగా ప్రారంభించామన్నారు. నాలుగేళ్లలో ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి హగరి నుంచి పెద్ద ఎత్తున ఇసుక తరలిస్తూ రూ. కోట్లు గడించారని ఆరోపించా రు. రైతుల సంక్షేమం, నదులను బతికించాలనే సంకల్పం టిడిపిదైతే, కాపు నదిని అవినీతి, అక్రమాలకు అడ్డాగా మార్చుకొని సహజ వనరులను దోపిడీ చేశారని దుయ్యబట్టారు. ప్రజలు, రైతులకు ఉపయోగపడే ఇలాంటి మంచి కార్యక్రమాలు ఒక్కటైనా చేశావా అని "కాపు"ను కాలవ నిలదీశారు.

క్రీడా మైదానం ఆక్రమణపై ధర్నా

గుత్తి : మండలంలోని బాచుపల్లి గ్రామంలో క్రీడా మైదానాన్ని ఆక్రమించుకున్న కబ్జాదారులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద స్థానికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నెంబర్ 188లో 18 ఎకరాలు ప్రభుత్వ స్థలం ఉండేదన్నారు. అయితే ఇందులో కొంత భాగం క్రీడా మైదానం చేసుకుని యువకులు క్రికెట్ ఆడే వారన్నారు. ఈనేపథ్యంలో ఇటీవల ఆరెకరాల భూమిని కొందరు ఆక్రమించుకున్నారన్నారు. ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుని క్రీడా మైదానానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. అలాగే శ్మశాన వాటిక స్థలం సమస్యను పరిష్కరించాలన్నారు. అనంతరం తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా, ఉప తహశీల్దార్ లలితకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రమేష్‌నాయుడు, మాజీ సర్పంచి వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశం బహిష్కరణ

గుత్తి : మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి జి.విశాలాక్షి అధ్యక్షతన సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశాన్ని టిడిపి ఎంపిటిసిలు, సర్పంచులు బహిష్కరించారు. సమావేశం ప్రారంభంకాగానే టిడిపి సర్పంచి పి.భరత్‌కుమార్, ఎంపిటిసిలు ధనంజయ, జింకా నారాయణస్వామి ప్లకార్డులు పట్టుకుని పోడియం ముందు కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14, 15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వం అడ్డు తగులుతోందన్నారు. ఇప్పటికైనా ఆ నిధులను సర్పంచుల పిఎఫ్ ఎంఎస్ ఖాతాలోకి జమచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిదానాలు చేస్తూ మండల సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించారు.

10న మండల సమావేశం

నార్పల : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండల అధ్యక్షులు నాగేశ్వరరావు అధ్యక్షతన ఈనెల 10వ తేదీ బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ దివాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు వారి శాఖలకు సంబంధించిన పూర్తి నివేదికలతో సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ఎస్.గూడూరులో పోలీసు ఆంక్షలు

పుట్లూరు : మండలంలోని శనిగల గూడూరులో పోలీసులు 30 యాక్ట్ అమలులో ఉందని ఎస్ఐ దిలిప్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ 30 యాక్టు అమలులో ఉంటుందన్నారు. ఇప్పుడిప్పుడే గ్రామంలో ప్రశాంతత వాతావరణం నెలకొంటున్న నేపథ్యంలో బయటి వ్యక్తులు గ్రామంలోకి రావద్దన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు రావాలంటే తప్పనిసరిగా డీఎస్పీ అనుమతి తీసుకోవాలని కోరారు.

ఓటుహక్కుపై అవగాహన

అనంతపురం : నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న శ్రీచైతన్య రెసిడెన్షియల్ పాఠశాలలో సోమవారం నమూనా సార్వత్రిక ఎన్నికలు నిర్వహించి విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎజిఎం సుబ్బారెడ్డి ఎన్నికల ఆవశ్యకత, ఎలా నిర్వహించాలనే విషయాలను కూలంకుశంగా వివరించారు. అలాగే భవిష్యత్‌లో ఎలా ఓటుహక్కు వినియోగించుకోవాలో తెలుసుకోవాలన్నారు. ప్రతి పౌరుడూ హక్కులతోపాటు బాధ్యతలను కూడా తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వివరించారు. ఇందులో భాగంగా విద్యార్థులను నాలుగు భాగాలుగా విభజించి ఎన్నికలు నిర్వహించారు. ఓట్ల లెక్కింపు అనంతరం గెలుపొందిన అభ్యర్థులను ప్రకటించారు. అనంతరం గెలిచిన వారితో ప్రమాణస్వీకారం చేయించారు. తర్వాత మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమీనాఖాన్, అకాడమిక్ కోఆర్డినేటర్ నాగభూషణ, వైస్ ప్రిన్సిపల్ షమీనా, డీన్ సత్యనారాయణ, కో డీన్ చంద్రమోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చేనేత పరిశ్రమను ఆదుకోవాలి

ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర శాఖ కార్యదర్శి చెంగల మహేష్

ప్రజాశక్తి-ఉరవకొండ


సంఘీభావం తెలుపుతున్న ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ నాయకులు

చేనేత పరిశ్రమను ప్రభుత్వాలు అన్ని విధాలా ఆదుకోవాలని ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర శాఖ కార్యదర్శి చెంగల మహేష్ డిమాండ్ చేశారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని దేవాంగ కళ్యాణ మండపంలో ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్‌లోని చేనేత కులాల వారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షోభంలో ఉన్న చేనేత పరిశ్రమను, కార్మికులను కాపాడాలని చేనేత వస్త్రాల వాడకాన్ని పెంచాలన్నారు. అలాగే కార్మికులకు ముడిసరుకును సబ్సిడీతో అందించాలని, సంక్షేమ పథకాలతో పాటు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. చేనేత వస్త్రాలపై విధించిన జీఎస్టీని తక్షణమే ఎత్తివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందా రాము, చేనేత కుల పెద్దలు కాసుల శ్రీధర్, సుబ్రమణ్యం, తిరువీధుల వెంకటేశులు, కృష్ణమూర్తి, విశ్వనాథ్, ముక్కర బాలచంద్ర, చంగలి భోజరాజు, పెద్దకోట్ల రవి, శిరుమాళ్ల కృష్ణమోహన్, పెద్దకోట్ల శ్రీనివాసులు, వేల్పుల శ్రీనివాసులు, సూర్యప్రకాష్, కుళ్లాయిబాబు పాల్గొన్నారు.

విత్తన, ఎరువుల నాణ్యతపై శిక్షణ

ఉరవకొండ : రైతులు సాగు చేసే విత్తన, ఎరువుల నాణ్యతపై పట్టణంలోని వైఎస్ఆర్ ఇంటిగ్రేటెడ్ టెస్టింగ్ ల్యాబ్ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించినట్లు ఉరవకొండ డివిజన్ ఎడిఎ పద్మజ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఇందులో భాగంగా రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలతో పాటు విత్తనాలు, ఎరువులు నాణ్యతతో ఉన్నాయా.. లేదా.. అనే అంశాలపై పరీక్షలు నిర్వహించిన తర్వాతే రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అఫీషియల్ అనలిస్టులు శేఖన్న, మంజులత, జూనియర్ అనలిస్టులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

అనంతపురం క్రైం : ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ వెంకటేష్‌నాయక్ హెచ్చరించారు. ఈమేరకు సోమవారం స్థానిక సుభాష్ రోడ్డులో అడ్డంగా ఉంచిన ఆటోలు, వాహనాలను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆయా వాహనాలకు సంబంధించిన లైసెన్సులు, ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. రోడ్డుపై అడ్డంగా పార్కింగ్ చేసిన పలు వాహనాలకు జరిమానాలు విధించారు. ట్రాఫిక్ కి ఇబ్బంది కలిగించే ఎలాంటి చర్యలనూ సహించేది లేదన్నారు.

క్రైస్తవుల నిరసన ర్యాలీ

రాయదుర్గం : మణిపూర్‌లో తక్షణమే శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణంలో రాయదుర్గం పాస్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రైస్తవులు నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక బిటిపి రోడ్డు లోని చర్చి వద్ద నుంచి చేపట్టిన ర్యాలీని తేరుబజార్, వినాయక కూడలి, లక్ష్మీ బజార్ మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకూ చేపట్టి అక్కడ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ ప్రదర్శనలో రాయదుర్గం తాలూకాకు చెందిన పలువురు పాస్టర్లు, క్రైస్తవులు, దళితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మణిపూర్‌లో దాడులను ఆపాలని, శాంతిని పరిరక్షించాలని డిమాండ్ చేశారు.

వార్డు మెంబర్ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్

నార్పల : మండలవ్యాప్తంగా ఖాళీగా ఉన్న వార్డు సభ్యుల స్థానాలను భర్తీ చేసేందుకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎంపిడిఒ దివాకర్, ఇఒఆర్‌డి లక్ష్మీనరసింహా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులోభాగంగా 8వతేదీ 10వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకూ నామినేషన్ పత్రాలు స్వీకరించనున్నట్లు తెలిపారు. 11న నామినేషన్ పత్రాల పరిశీలన, 14న నామినేషన్ పత్రాల ఉపసంహరణ, 19న ఎన్నికలు, ఆరోజే లెక్కింపు ఉంటుందన్నారు.

కెజిబివిలో నాణ్యమైన భోజనం అందించాలి

ఉరవకొండ : కస్తూరిబా గాంధీ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమిరెడ్డి, జడ్పిటిసి హనుమంతు సూచించారు. సోమవారం విడపనకల్లు మండలం మాలాపురంలో ఉన్న కెజిబివిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా విద్యార్థులను సమస్యలతోపాటు భోజనం నాణ్యతపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు గుణాత్మకమైన విద్యతోపాటు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. అయితే కొన్నిచోట్ల సిబ్బంది నిర్లక్ష్యంతో విద్యార్థినులకు ప్రభుత్వం కేటాయించిన మెనూ పాటించకుండా భోజనం అందిస్తున్నారన్నారు. అంతేగాకుండా పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యంగా ఉంటున్నారని విద్యార్థినులు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. వెంటనే సరిచేసుకుని నాణ్యతతో, రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు తులసి, విడపనకల్ వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, మాలాపురం రామాంజనేయులు, రంగన్న, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రైలు కిందపడి మహిళ ఆత్మహత్య

తాడిపత్రి రూరల్ : రైలు కిందపడి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన రూరల్ పరిధిలోని చల్లవారిపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని చిన్న పడమల గ్రామానికి చెందిన చాపగల రమాదేవి (24) సోమవారం ఇంట్లో నుంచి వెళ్లి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు భర్త మంజునాథ తెలిపినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతికి కారణాలు తెలియ రాలేదని, భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు గుంతకల్ రైల్వే సీఐ తెలిపారు.

బసినేపల్లి వద్ద వ్యక్తి..

గుత్తి : మండలంలోని బసినేపల్లి గ్రామ సమీపంలో సోమవారం రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం కమలకుంట్ల గ్రామానికి చెందిన రామచంద్ర (50) కుటుంబ సమస్యలతో బసినేపల్లి వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న జీఆర్పీ ఎస్ఐ నాగప్ప, హెడ్‌కానిస్టేబుల్ వాసు, తదితరులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో కూలీలకు గాయాలు

గుత్తి : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యవసాయ కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని జక్కలచెరువు గ్రామానికి చెందిన పలువురు ఆటోలో వ్యవసాయ పనులకు బసినేపల్లి తండాకు బయలుదేరారు. పట్టణంలోని ఆసుపత్రి వద్ద ఆటో వెళుతుండగా వెనకవైపున లారీ ఢీకొంది. దీంతో హాజీవలి, రామతులసి, బిందు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బైక్ బోల్తాలో మరో ఇద్దరు..

మండలంలోని బసినేపల్లి గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం పోరుమానుపల్లి చెందిన రామన్న, తిప్పయ్య స్వామిలు గుత్తికి రావడానికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. బసినేపల్లి గ్రామ సమీపంగా రాగానే కుక్క అడ్డు రావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడ్డ ఇరువురిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రి తరలించారు.

పేకాటజూదరులు అరెస్టు

యాడికి : మండలంలోని చందన గ్రామ పంచాయతీ పరిధిలోని పొలిమేరలో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న వారిపై సోమవారం దాడి చేసినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా 8 మందిని అదుపులోకి తీసుకుని రూ.25,500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం కోర్టుకు హాజరు పరచనున్నట్లు తెలిపారు.

బంగారు గొలుసు అపహరణ

గార్లదిన్నె : మండల పరిధిలోని కల్లూరు అగ్రహారంలో సోమవారం ఉదయం వృద్ధురాలు వీలమ్మ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగులు దొంగలించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ద్విచక్ర వాహనంలో వచ్చిన దుండగులు అంగడి నిర్వహిస్తున్న నీలమ్మను సిగరెట్ ఇవ్వాలని అడిగారు. దీంతో ఆమె సిగరెట్ ఇవ్వడానికి వెళ్తుండగా మెడలోని చైన్‌ను లాక్కొని పామిడి వైపు పరారైనట్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ దేవా తెలిపారు.

అనంతపురం క్రైం : స్థానిక శ్రీనగర్ కాలనీలో వృద్ధురాలి మెడలోనుంచి చైన్‌ను దుండగులు లాక్కెళ్లారు. 4 వ పట్టణ సీఐ ప్రతాపరెడ్డి తెలిపిన వివరాల మేరకు సోమవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో శ్రీనగర్ కాలనీలో ఉన్న ఎస్ఎస్‌బిబీ మాన్షన్‌కు దగ్గరలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి కాకర్ల రంగమ్మ అనే మహిళ మెడలో చైన్‌ను లాక్కెళ్లారు. 4 వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

తాడిపత్రి రూరల్ : మండల పరిధిలోని పెన్నానది బ్రిడ్జిపై బైకు అదుపుతప్పి ఫుట్‌పాత్‌ను ఢీకొనడంతో సోమవారం ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. సజ్జలదిన్నె గ్రామానికి చెందిన షౌకత్‌వలి తన ద్విచక్ర వాహనంపై ఏడాది కుమార్తె మొహతాజ్‌తోపాటు బంధువుల పిల్లలు అభిదా, మస్తాన్‌లి, మహమ్మద్ యూనిస్‌తో కలిసి తాడిపత్రికి వస్తుండగా పెన్నానది బ్రిడ్జిపైకి రాగానే బ్రిడ్జిపై ప్రమాదశాత్తు ఫుట్‌పాత్‌ను ఢీకొని కింద పడ్డాడు. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న ఐదుగురూ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. షౌకత్‌వలి, మస్తాన్‌వలి, మహ్మద్ యూనిస్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించినట్లు వైద్యులు తెలిపారు. ఈమేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గద్దర్‌కు నివాళి

ఉరవకొండ : ప్రజా గాయకుడు గద్దర్ మృతి పట్ల పలువురు నివాళులర్పించారు. ఇందులో భాగంగా పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు శివన్న, చెన్నారాయుడు, టిడిపి నాయకులు విజయభాస్కర్, మాజీ సర్పంచి మోపిడి గోవిందు, సిపిఐ వజ్రకరూరు కార్యదర్శి సుల్తాన్, ఉరవకొండ కార్యదర్శి తలారి మల్లికార్జున, టిడిపి నాయకులు, వార్డు సభ్యులు రామాంజనేయులు, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ ఫలితాలు విడుదల

అనంతపురం : అనంతపురం జెఎన్‌టియు పరిధిలో నిర్వహించిన బీటెక్ 4వ సంవత్సరం 1వ సెమిస్టర్ (ఆర్19), (ఆర్15) సప్లిమెంటరీ, బీ.ఫార్మసీ 4వ సంవత్సరం 1వ సెమిస్టర్ (ఆర్19), (ఆర్15) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను సోమవారం విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎక్సామినేషన్ బి.చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. పరీక్షా ఫలితాల కోసం http://jntuaresults.ac.inను సంప్రదించాలని కోరారు.

మట్కా నియంత్రణకు చర్యలు : ఎస్పీ

అనంతపురం క్రైం : పేద, సామాన్యుల బతుకులను ఛిద్రం చేస్తున్న మట్కా నియంత్రణకు చర్యలు చేపట్టామని ఎస్పీ కె.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మట్కా నిర్వాహకులపై జిల్లావ్యాప్తంగా దాడులు కొనసాగుతున్నాయన్నారు. మట్కాతో సంబంధం లేని ఎవరిపైనా చర్యలు తీసుకోవడం లేదన్నారు. తాడిపత్రిలో కూడా మట్కాతో సంబంధం ఉన్న వారిపై మాత్రమే చర్యలు చేపట్టామన్నారు. మట్కాతో సంబంధం ఉన్న ఎవరినీ వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు.

వి.కొత్తకోటలో అక్రమాలు జరగలేదు..

ఉరవకొండ : విడపనకల్ మండలం వి.కొత్తకోట పంచాయతీలో ఎలాంటి అక్రమాలు జరగలేదని, ఆధారాలు లేకుండా నిరాధారాలతో మాట్లాడడం మానుకోవాలని సర్పంచి తిమ్మరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనపై ఎంపిటిసి తిమ్మరాజు చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమన్నారు. గ్రామంలో చేసిన ప్రతి పనికీ బిల్లులు ఉన్నాయన్నారు. మరోసారి ఇలాంటి నిరాధార ఆరోపణలు చేస్తే చట్టపరంగా న్యాయ సలహాలు తీసుకుని పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు.

నేడు ఉచిత గుండె వైద్యశిబిరం

నార్పల : మండల కేంద్రంలోని తిక్కస్వామి ఆలయ ఆవరణలో అనంతపురం ప్రభుత్వ వైద్యశాల కమిటీ సభ్యులు నార్పల సత్యనారాణరెడ్డి ఆధ్వర్యంలో అనంతపురం మార్క్ గుండె ఆసుపత్రి సహకారంతో మంగళవారం ఉచిత గుండె వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'జగనన్న సురక్ష' సరికొత్త చరిత్ర

శింగనమల : రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన జగనన్న సురక్ష కార్యక్రమం ఒక చరిత్ర అని మండల వైసిపి మాజీ యూత్ కన్వీనర్ జెల్లీ శ్రీనివాసులు యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. అర్హులెవ్వరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందకుండా మిగిలిపోరాదన్న లక్ష్యంతో ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకే సిఎం జగన్ సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. రెండు దశల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టి అర్హులను గుర్తించి అవసరమైన ధ్రువపత్రాలను ఉచితంగానే అందించామన్నారు.